# గుడిసె లేని తెలంగాణే కేసీఆర్ లక్ష్యం

## రాజ్యసభ సభ్యులు బండి పార్థసారథిరెడ్డి



మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు పార్థసారథిరెడ్డి

సత్తుపల్లి టౌన్, నవంబర్ 17 : గుడిసె లేని తెలంగాణ రాష్ట్రాన్ని చూడాలని సీఎం కేసీఆర్ సంకల్పించుకున్నారని రాజ్యసభ సభ్యులు బండి పార్థసారథిరెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలో పలు వార్డుల్లో ఆయన మానవతారాయ్‌తో కలిసి సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పార్థసారథిరెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ సాధించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని, సాధించిన తెలంగాణను అభివృద్ధి చేసుకోవాలన్నది కేసీఆర్‌కే సాధ్యమని చెప్పారు. పల్లెల్లో అర్హులందరికీ పక్కాగృహాన్ని అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నారని అన్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్య సత్తుపల్లి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నారని అలాంటి నాయకుడిని గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని చెప్పారు. స్థానికంగా ఉన్న సమస్యలను సొంత నిధులతో పరిష్కరిస్తానని బండి హామీ ఇచ్చారు. మానవతారాయ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీకి నాయకత్వంలేదని, కేసీఆర్ బీఆర్‌ఎస్ పార్టీలా క్రమశిక్షణ లేదన్నారు. జిల్లాలో ఉంటూ సత్తుపల్లి నియోజకవర్గం ఎల్లలు తెలియని భట్టి విక్రమార్క వంటి వారు కూడా ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నారని, రేపు తెలంగాణలో కాంగ్రెస్ గెలిస్తే ముఖ్యమంత్రుల కోసం కొట్లాట ఉంటుందని చెప్పారు. పలువురు కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు బండి పార్థసారథిరెడ్డి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారిలో కొండలు సాల్మన్‌రాజు, కాలంక కృష్ణతో పాటు మరికొన్ని కుటుంబాలు ఉన్నాయి. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేశ్, బీఆర్‌ఎస్ నాయకులు గఫార్, పట్టణ అధ్యక్షులు రఫీ, మల్లూరు అంకమరాజు పాల్గొన్నారు.

## నేడు ఎమ్మెల్యే కందాళ ప్రచారం

కూసుమంచి, నవంబర్ 17: కూసుమంచి మండలంలో పాలేరు ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి శనివారం 10 గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేయనున్నారు. ఉదయం 8 గంటలకు పూర్యాతండా, 9 గంటలకు బోడియాతండా, 9 గంటలకు చౌటపల్లి, 10 గంటలకు కిష్టాపురం, 11.30 గంటలకు తురకగూడెం, సాయంత్రం 5 గంటలకు జీళ్లచెరువు, 6.30 గంటలకు ధర్మాతండా, 7.10 గంటలకు జగ్మాల్‌తండా, 7.45 లోక్యాతండా, 8.30 గంటలకు కొత్తతండాల్లో పర్యటన జరుగనున్నది. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పార్టీ నాయకులు కోరారు.

## ఇస్రోను సందర్శించిన 'ప్రియదర్శిని' విద్యార్థినులు



ఇస్రో సందర్శనలో కళాశాల విద్యార్థినులు

ఖమ్మం రూరల్, నవంబర్ 17: మండలంలోని ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థినులు నెల్లూరు జిల్లా శ్రీహరికోటలోని ఇస్రో సతీశ్‌ధావన్ అంతరిక్ష పరిశోధనా కేంద్రాన్ని సందర్శించారు. విజ్ఞాన యాత్రలో భాగంగా వారు గురువారం ఇస్రోను సందర్శించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గోపాల్ తెలిపారు. ఈ సందర్శనలో విద్యార్థులతో పాటు డైరెక్టర్ ఏ వెంకటరమణ, అధ్యాపకులు ముజఫర్, ప్రవీణ్, అమూల్య తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి రూ.10వేల సాయం

తిరుమలాయపాలెం, నవంబర్ 17: మండలంలోని పిండిప్రోలు గ్రామ పంచాయతీ శివారు పాపాయిగూడెంలో రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన రేపాకుల రాజు కుటుంబానికి శుక్రవారం పిండిప్రోలుకు చెందిన బోర్డర్ పోలీస్ హెడ్ కానిస్టేబుల్ పరికపల్లి ఉపేందర్ రూ.10,000 సాయం అందజేశారు. కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ మండల ఉపాధ్యక్షుడు చామకూరి రాజు, గ్రామ అధ్యక్ష,కార్యదర్శులు పరికపల్లి చంద్రశేఖర్, రాజు, ముత్తయ్య పాల్గొన్నారు.

## డ్రైవర్ల సంఘ నాయకుడు ఖాన్ మృతి



ఖమ్మం, నవంబర్ 17: ఖమ్మం జిల్లా ప్రభుత్వ డ్రైవర్ల సంఘం జిల్లా సంయుక్త కార్యదర్శి , డీఆర్‌డీఏ కార్యాలయంలో డ్రైవరుగా పనిచేస్తున్న ఆలయర్ ఖాన్ శుక్రవారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని ఖమ్మం జిల్లా ప్రభుత్వ డ్రైవర్ల సంఘం సభ్యులు సందర్శించి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ప్రభుత్వ డ్రైవర్ల సంఘం ఫౌండర్, రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ఎస్ హరినాథ్‌రెడ్డి, ఖమ్మం జిల్లా అధ్యక్షుడు ఎండీ హకీమ్, హౌస్ బిల్డింగ్ సొసైటీ చైర్మన్ ఎండీ సలీం, రాష్ట్ర మాజీ అధ్యక్షుడు వీజీకే మూర్తి, జిల్లా ముఖ్య సలహాదారులు మామిడి బాబురావు, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు రామారావు గౌడ్, దాసరి వేణుగోపాల్, ఖమ్మం జిల్లా డివిజన్ అధ్యక్షుడు ఎల్ గంగన్న, జిల్లా కోశాధికారి ఎస్వీ ప్రసాద్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎండీ జానీ, సభ్యులు గడ్డం రాములు, హసన్ పాల్గొన్నారు.

# ఆపదలో అండగా ఉండే నాయకుడు 'కందాళ'

**బీఆర్‌ఎస్ గెలిస్తేనే ఇంటింటికి సౌభాగ్యలక్ష్మి**

**కారు గుర్తుకు ఓటేసి కందాళను ఆశీర్వదించండి**

**ఇంటింటి ప్రచారంలో మాజీ ఎమ్మెల్యే చంద్రావతి, కందాళ విజయమ్మ, దీప్తిరెడ్డి**



బీఆర్‌ఎస్‌లో చేరిన వారితో ఎమ్మెల్యే కందాళ



మంగళగూడెంలో ప్రచారం చేస్తున్న దీప్తిరెడ్డి



ప్రచారంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే చంద్రావతి



ఇంటింటి ప్రచారం చేస్తున్న విజయమ్మ

ఖమ్మం రూరల్, నవంబర్ 17: వివిధ పార్టీల నుంచి బీఆర్‌ఎస్‌లోకి వలసలు కొనసాగుతూనే ఉన్నాయి. పక్షం రోజుల నుంచి పాలేరులోని ప్రతి గ్రామం నుంచి కందాళకు మద్దతు పెరుగుతుండడంతో మిగిలిన నాయకులు, కార్యకర్తలు సైతం అదే తోవ పడుతున్నారు. అందులో భాగంగానే శుక్రవారం తిరుమలయపాలెం మండలం బచ్చోడు తండా నుంచి కాంగ్రెస్ పార్టీకి చెందిన 25 కుటుంబాలు బీఆర్‌ఎస్‌లో చేరాయి. మండలంలోని సాయిగణేష్‌నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు మెజార్టీ సాధించే విధంగా పని చేయాలని సూచించారు.

ఖమ్మం రూరల్, నవంబర్ 17: మరోసారి మన ఇంటి పార్టీ బీఆర్‌ఎస్ గెలిస్తే ప్రతి ఇంటికి సౌభాగ్యలక్ష్మి అందుతుందని ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి సతీమణి విజయమ్మ అన్నారు. శుక్రవారం మండలంలోని మంగళగూడెంలో విజయమ్మ కూతురు సర్పంచ్ యండపల్లి రాధికతో కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. అనంతరం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు గ్రామంలో గడపగడపనూ తట్టి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వచ్చే బీఆర్‌ఎస్ సర్కార్ హయాంలో మరిన్ని సంక్షేమ పథకాలు అమలవుతాయన్నారు. ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి మంచి మెజార్టీ అందజేయాలని వారు కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సైదాబీ, సొసైటీ డైరెక్టర్ యండపల్లి రవి, వీరెల్లి నాగయ్య, ఉపేందర్‌తోపాటు మహిళలు పాల్గొన్నారు.

ఖమ్మం రూరల్, నవంబర్ 17: మండలంలోని ఆరెంపుల గ్రామంలో శుక్రవారం సాయంత్రం జరిగిన బీఆర్‌ఎస్ ఎన్నికల ప్రచారానికి గ్రామ ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. ఈ ప్రచార కార్యక్రమానికి ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి సతీమణి కందాళ విజయమ్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలిసారిగా ఇంటంటి ప్రచారానికి విచ్చేసిన విజయమ్మకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఊరి పొలిమేరలో మంగళ హారతులు ఇచ్చి అపూర్వ స్వాగతం పలికారు. అనంతరం స్థానిక నాయకులతో కలిసి ఆమె విస్తృతంగా గ్రామంలో పర్యటించారు. ఆపద వచ్చిందంటే చాలు ఆదుకున్న గొప్ప నాయకుడు కందాళకు తప్పకుండా అండగా నిలబడతామని ప్రతి గడప నుంచి వచ్చిన మహిళ భరోసా కల్పించారు. కార్యక్రమంలో నాయకులు బండి సతీశ్, చుంచు జానకిరాములు, చుంచు నారాయణ, నర్సింహారావు, అనంతరెడ్డి, కృష్ణ పాల్గొన్నారు.

కూసుమంచి (నేలకొండపల్లి), నవంబర్ 17: దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన సీఎం కేసీఆర్ పాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందని మాజీ ఎమ్మెల్యే, పాలేరు బీఆర్‌ఎస్ సమన్వయ కర్త డాక్టర్ బానోత్ చంద్రావతి అన్నారు. నేలకొండపల్లి మండలం మంగాపురం తండాలో రెండో రోజు శుక్రవారం ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి గెలుపును కాంక్షిస్తూ ఇంటింటి ప్రచారాన్ని సాగించారు. గిరిజనులకు స్వయం పాలనను అందించిన ఘనత సీఎం కేసీఆర్‌దేనన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి మూడోసారి ముఖ్యమంత్రి అయ్యేందుకు కేసీఆర్‌కు ప్రజల దీవెలను ఉన్నాయన్నారు. సాగు నీరు, విద్యుత్, విద్య, వైద్య రంగాలతోపాటు మౌలిక వసతుల కల్పనలో రాష్ట్రం అన్ని రాష్ట్రాల కంటే ముందు ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు మహిళలు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో నాగులచవితి



పాండురంగాపురంలో పుట్టలో పాలు పోస్తున్న భక్తులు, మాలధారులు

ఖమ్మం రూరల్, నవంబర్ 17: మండలంలో శుక్రవారం నాగులచవితిని మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. తెల్లవారుజామునుంచే పుట్టల వద్ద మహిళల సందడి నెలకొన్నది. మండలంలోని ప్రతి గ్రామంలో సమీపంలోని పుట్టల వద్దకు మహిళలు భారీగా తరలివచ్చి పూజలు చేశారు. దాదాపుగా సాయంత్రం వరకు పుట్టల వద్ద పూజలు కొనసాగాయి. కొబ్బరికాయలు కొట్టి మొక్కలు తీర్చుకున్నారు.

రఘునాథపాలెం, నవంబర్ 17: నాగుల చవితిని శుక్రవారం ఖమ్మం అర్బన్, రఘునాథపాలెం మండలాల ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పాండురంగాపురంలో రామలింగేశ్వర ఆలయం తెల్లవారుజామున నుంచే భక్తులతో రద్దీగా కన్పించింది. రఘునాథపాలెంలోని పురాతన శివాలయంలో, ఖానాపురం అభయ వేంకటేశ్వరస్వామి ఆలయంలోని పుట్ట వద్ద మహిళలు, అయ్యప్ప భక్తులు భారీగా తరలివచ్చి పూజలు చేశారు.

కూసుమంచి, నవంబర్ 17: కూసుమంచిలోని కాకతీయల నాటి శివాలయంలో ఉన్న పుట్ట వద్ద శుక్రవారం తెల్లవారుజాము నుంచే భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. చలిమిడి, నువ్వులు బెల్లం, పానకం, పాలు వంట వాటితో ప్రసాదాలు చేశారు. పుట్ట వద్ద చిన్నారులకు చెవులు కుట్టించారు.

## ప్రతి ఓటర్‌కు స్లిప్ అందాలి : కలెక్టర్



చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న కలెక్టర్ గౌతమ్

కూసుమంచి, నవంబర్ 17: ఓటర్ లిస్టులోని ప్రతి ఇంటికీ వెళ్లి పోల్ చిట్టీలు పంపిణీ చేయాలని బీఎల్‌వోలు పూర్తి బాధ్యత తీసుకోవాలని కలెక్టర్ వీపీ గౌతమ్ అన్నారు. కూసుమంచిలో శుక్రవారం ఇంటింటికీ పోల్ స్లిప్‌ల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కూసుమంచిలో ఇప్పటి వరకు ఇచ్చిన స్లిప్‌ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి పోలింగ్ తేదీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఓటరు ఫోన్‌ను తీసుకొని సీ విజిల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించారు.

**పోలింగ్ కేంద్రాల తనిఖీ..**

కూసుమంచి, పాలేరులోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద ర్యాంప్‌లు, లైటింగ్ వంటి వాటిని అడిగి తెలుసుకున్నారు. కూసుమంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాలు, పాలేరు పాఠశాలలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం కూసుమంచి ఉన్నత పాఠశాలలో పనులు పూర్తి కాలేదని సంబంధిత ఇంజినీరింగ్ అధికారులపై అగ్రహం వ్యక్తం చేశారు. పనుల్లో ఆలస్యం ఎందుకు అవుతున్నదని ప్రశ్నించారు. మండలంలో ఏర్పాటు చేసిన అంతరాష్ట్ర చెక్‌పోస్టుతోపాటు మరో చెక్ పోస్టును పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ జితేందర్ రెడ్డి, ఎస్సై రమేశ్ కుమార్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

## ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలి

### ఖమ్మం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఖమ్మం కార్పొరేషన్ కమిషనర్ ఆదర్శ్ సురభి



ఓటు హక్కుపై చైతన్యం కల్పిస్తున్న కార్పొరేషన్ కమిషనర్ ఆదర్శ్ సురభి

ఖమ్మం, నవంబర్ 17: స్వేచ్ఛగా, న్యాయబద్ధంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఖమ్మం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఖమ్మం కార్పొరేషన్ కమిషనర్ ఆదర్శ్ సురభి అన్నారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉదయం కమిషనర్, సర్దార్ పటేల్ స్టేడియంలో వాకర్స్, క్రీడాకారులకు ఓటు హక్కుపై చైతన్యం కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటు విలువైన ఆయుధమని, విలువైన ఓటును ప్రలోభాలకు గురై అమ్ముకోవద్దని, ఈ దిశగా చర్చ జరగాలని, కుటుంబీకులు, గ్రామస్తుల్లో అవగాహన కల్పించి చైతన్యం తెచ్చే బాధ్యత యువతపై ఉందన్నారు. ఎన్నికల్లో ధన, ప్రలోభాలు ఏవైనా దృష్టికి వస్తే సి విజిల్ యాప్ ద్వారా అధికారుల దృష్టికి తేవాలన్నారు. 100 నిమిషాల్లో చర్యలు చేపట్టకపోతే, ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేరుకుంటుందని, సి విజిల్ యాప్ ద్వారా వచ్చిన ప్రతి ఫిర్యాదుకు అధికారులు జవాబుదారీతనం వహిస్తారని ఆయన అన్నారు. కమిషనర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్ వద్ద ఫొటో దిగారు. మయాంక్ సింగ్, కె.శ్రీరామ్, సునీల్ రెడ్డి, మల్లీశ్వరి, సీహెచ్. స్వామి, అధికారులు పాల్గొన్నారు.